క్లుప్తంగా

కార్మికుల దీక్షకు మద్దతు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం చొరవ చూపి, సత్వరం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. సోమవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. యాజమాన్యం, పాలక ప్రభుత్వం కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. గత ఎన్నికల్లో మంత్రి నారా లోకేష్ కార్మికుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్కే బాషా, వై.సుబ్బారావు, ఆశీర్వాదం, ఇశ్రాయిల్, శారద, సారమ్మ, రమాదేవి, దుర్గాభవాని, గురవయ్య, దానయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో ద్విచక్ర వాహనం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో సుమారు మూడు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లారని సోమవారం స్థానికులు తెలిపారు. ఏపీ 16 ఏసీ 6149 నంబరు గల వాహనాన్ని రోడ్డు పక్కనే ఖాళీ స్థలంలో పార్క్ చేశారు. బండికి చుట్టూ పిచ్చిమొక్కలు కూడా మొలిచాయి. ద్విచక్ర వాహనం పార్కింగ్‌పై స్థానికులు సమాచారం అందించారని తాడేపల్లి పోలీసులు తెలిపారు.

స్నానం చేసి వచ్చే లోపు బంగారం మాయం

తాడికొండ: ఇంటిలోని అల్మారాలో పెట్టిన బంగారం వృద్ధురాలు స్నానం చేసి వచ్చేలోగా చోరీకి గురైన ఘటన రావెల గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు..గ్రామంలోని దగ్గుమల్లి సామ్రాజ్యం అనే వృద్ధురాలు గత నెల 26న ఉదయం స్నానానికి వెళ్లింది. వెళ్తూ.. తన మెడలో ఉన్న రెండు పేటల నాను తాడు, మంగళ సూత్రం, నల్లపూసల గొలుసు మొత్తం రూ.1.60 లక్షల విలువ చేసే సుమారు 5 సవర్ల బంగారాన్ని ఆల్మారాలో పెట్టింది. స్నానం చేసి తిరిగి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తి బయటకు వెళ్తూ కనిపించారు. అల్మారాలో పరిశీలించగా బంగారం కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించింది. ఇంటిలో భక్తి కార్యక్రమం కారణంగా వృద్ధురాలు ఆదివారం రాత్రి తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జోజి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారని తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు.

బాల్య వివాహాలను నియంత్రిద్దాం

ఫిరంగిపురం: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఫిరంగిపురం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లో సోమవారం మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ బాలికలు చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. బాల్య దశలో వారికి వివాహం చేయడం వల్ల పలు రకాల సమస్యలు ఏర్పడుతాయని చెప్పారు. దానిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. అనంతరం గ్రామంలో కొవ్వొత్తులు వెలిగించి, ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు వ్యతిరేకించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ డి.సునీత, టి.హేమలతాభాస్కర్, సీహెచ్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పూజలు చేస్తే రూ.కోట్లు వస్తాయని మోసం

లక్ష్మీపురం: పూజలు చేయడం వల్ల కోట్లాది రూపాయలు వస్తాయని నమ్మబలికి రూ.15 లక్షలు వరకు నగదు తీసుకుని మోసం చేసిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ప్రకారం రాజేశ్వరకాలనీ 2వ లైన్ ప్రాంతానికి చెందిన మన్నెం నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడిగా చేసి రిటైర్డ్ అయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన భారతి అనే మహిళతో పరిచయం అయింది. భారతి నరసరావుపేటకు చెందిన బొమ్మలబోయిన వెంకాయమ్మ అలియాస్ నాగమణి అమ్మ అనే పేరు గల మహిళను పరిచయం చేసింది. నాగమణి అమ్మ వద్ద మణి ఉందని, పూజలు చేయడం వలన రూ.100 కోట్లు వస్తాయని చెప్పి నాగేశ్వరరావును నమ్మబలికారు. దీంతో 2024 మే 16వ తేదీ నుంచి పలు మార్లు నాగమణి అమ్మ అనే మహిళ గుంటూరు రాజేశ్వరకాలనికి వచ్చి పూజలు చేయాలంటూ విడతల వారిగా సుమారు రూ.15 లక్షల వరకు నగదు తీసుకుంది. నగదు తీసుకున్న నాగమణిని బాధితుడు నిలదీయడంతో మోసం చేశారని తెలుసుకున్నాడు. దీంతో దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే రోడ్డు



గుంతలమయంగా పేరుకలపూడి ప్రధాన రహదారి

మోరంపూడి గ్రామం నుంచి పేరుకలపూడి పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉన్నటువంటి ప్రధాన రహదారి మోరంపూడి నుంచి దాదాపు కిలోమీటర్ పైబడి తీవ్ర అధ్వానంగా తయారైంది. నరకానికి నకలు అన్నట్లుగా రోడ్డు బద్దలుగా పగిలి వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. వీర్లపాలెం, పెదపాలెం, పేరుకలపూడి, చినపాలెం గ్రామాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. ఎన్నిమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవు. తెనాలి నుంచి వీర్లపాలెం వరకు ఈ దారి గుండానే ఆర్టీసీ బస్సులు నిత్యం నడుస్తుంటాయి. ఇసుక ట్రాక్టర్లు, లారీల రద్దీ షరా మాములే. నిత్యం రద్దీగా ఉండే రహదారి మెరుగు పరచి ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులను రక్షించాలని పలువురు కోరుతున్నారు. – దుగ్గిరాల

వైఎస్సార్ సీపీ సమన్వయకర్తకు నోటీసులు



గుంటూరులోని పార్టీ కార్యాలయంలో వజ్రబాబుకు నోటీసు అందజేస్తున్న కానిస్టేబుల్

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబుపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారు. జనవరి నెలలో జరిగిన పొనుగుపాడు చర్చి గోడ కూల్చివేత ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఆయనపై వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నోటీసులు జారీ చేశారు. ఇదే ఘటనలో బాధితులను వజ్రబాబు కంటే ముందే మాజీ ఎంపీ వి.హర్షకుమార్, పలువురు మాల సంఘాల నాయకులు పరామర్శించి భరోసా ఇచ్చారు. వారందరి తరువాత వెళ్లిన వజ్రబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సైతం గోడ కూల్చివేతకు సంబంధించి బాధితులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. వందలాది మంది పోలీసులును అడ్డుపెట్టి కొందరు నాయకుల ప్రయోజనం కోసం గోడకూల్చి వేసిన ఘటన అందరిని కలిచివేసింది. ఈ నేపథ్యంలో తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడంతో పాటు దళితులను పరామర్శించేందుకు వెళ్తున్న బాల వజ్రబాబుపై కక్షపూరితంగా కేసు నమోదు చేయడం పట్ల పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతిపక్షపార్టీకి చెందిన పలు ఘటనల్లో పరామర్శించేందుకు వెళ్లిన నాయకులపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎటువంటి కేసులు నమోదు చేయలేదని గుర్తుచేసుకుంటున్నారు.

థైక్వాండో చాంపియన్‌షిప్‌లో మంగళగిరి విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

మంగళగిరి టౌన్ : మార్చి 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన 13వ ఇంటర్ స్కూల్ థైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో మంగళగిరి విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ మంగళగిరి ఈగల్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. 10 మంది క్రీడాకారులు పాల్గొనగా సబ్ జూనియర్ విభాగంలో నాగమణికంఠ వెండి పతకం, బి.జష్విత, జయశ్రీకర్ రెడ్డి, లిఖితాక్షర్, ధీరజ్, ధనుష్‌కుమార్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాజలోని ఈగల్ మార్షల్ ఆర్ట్స్ కార్యాలయంలో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తొలిసారిగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని వెండి, రజత పతకాలు సాధించడం పట్ల తమతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారని అన్నారు.

26, 27తేదీల్లో మోతడక 'చలపతి'లో అంతర్జాతీయ సదస్సు



పోస్టరు విడుదల చేస్తున్న చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు

మోతడక(తాడికొండ): ఈ నెల 26, 27 తేదీల్లో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఆర్‌సీ సెట్–2025 పేరిట అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, డీన్‌లతో కలిసి పోస్టరు విడుదల చేశారు. అంతర్జాతీయ సదస్సు తాజా అనువర్తనాలు, వినూత్న పరిశోధనలు, వివిధ అధ్యయనాలను చర్చించేందుకు గొప్ప వేదికగా నిలవనుందన్నారు. రీసెంట్ చాలెంజెస్ ఇన్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పేరిట సదస్సు నిర్వహణ జరుగుతుందని, వివిధ కళాశాలలు, యూనివర్శిటీలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కావున అందరూ పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు సమర్పించేందుకు ఈ నెల 17 చివరి తేదీ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ జయకృష్ణ, డైరెక్టర్ డి.వినయ్ కుమార్, డీన్‌లు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ బాల మురళీ, డాక్టర్ వీవీ సుబ్బారావు వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచితంగా వినికిడి పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఉచిత వినికిడి పరీక్షల శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్.శిరీష ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శిరీష మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు గుంటూరులోని స్నేహిల్ స్పీచ్ అండ్ హియరింగ్‌సెంటర్, పాజిటివ్ రిహాబిలిటేషన్ సెంటర్, సంజయ్ హియరింగ్ క్లీనిక్, అమరావతి స్పీచ్ అండ్ హియరింగ్‌సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. వినికిడి సమస్య ఉన్న వారు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రాథమిక దశలోనే వినికిడి సమస్యలను గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు అన్నారు. రాయితీతో కొంత మంది వినికిడి పరీక్షల శిబిరానికి వచ్చేవారికి మిషన్లు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సి.హెచ్.సుజాత, ఆడియాలజిస్టులు పి.లావణ్య, బి.క్రిస్టఫర్, రవితేజ, నిస్సీ, ఏంజెల్ పాల్గొన్నారు.

టీవీ చానల్ కార్యాలయం పెడతామంటూ రూ.30 లక్షల మోసం

లక్ష్మీపురం: ఓ టీవీ చానల్ నిర్వాహకుడు, వాటాదారుడు ఇద్దరు కలిసి వివాదం చోటు చేసుకుంటున్న ఇంట్లో టీవీ ఛానల్ కార్యాలయం పెడతామంటూ రూ.30 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన వారివురిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. యనమదల ప్రాంతానికి చెందిన అరిగెల అరుణ్‌కుమార్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అరుణ్‌కుమార్ పెదనాన్న కుమార్తె అమరలింగేశ్వరి మానసిక వికలాంగురాలు కావడంతో ఆమె బాగోగులు చూసుకుంటూ ఉన్నందున ఆమెపేరుతో ఉన్న ఆస్తి విలునామను పెదనాన్న అరుణ్‌కుమార్‌కు రాశాడు. అయితే 2022లో అమరలింగేశ్వరి అనారోగ్య కారణంగా మృతి చెందింది. అయితే అమరలింగేశ్వరి పేరుతో గురజాలలో మూడంతస్తుల భవనానికి సంబంధించి పూర్తి హక్కుదారుడుగా ఉన్న అరిగెల అరుణ్‌కుమార్‌కు పెదనాన్న కుమారులకు మధ్య ఆస్తి వివాదం మొదలైంది. అదే సమయంలో గుంటూరు బృందావన్‌గార్డెన్స్ 6వలైన్‌లో ఉన్న టి.వి–2 నిర్వాహకుడు శ్రీకాంత్ మహేష్, వాటదారుడు భువనం శ్రీనివాసరావులు పరిచయం అయి గురజాలలో ఉన్న ఇంటి ఆస్తి వివాదం నడుస్తున్న నేపథ్యంలో ఆ భవనంలో టి.వి–2 కార్యాలయంను పెట్టడం వల్ల ఎవరు దాని జోలికి రారని చెప్పి నమ్మబలికారు. అప్పటి నుంచి పలు మార్లు రూ.30 లక్షలు టి.వి. ఛానల్ పెట్టేందుకు ఖర్చు అవుతుందని చెప్పి అరుణ్‌కుమార్ నుంచి నగదు ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నారు.

అలాగే మరి కొంత నగదు అవసరం ఉందని చెప్పి అరుణ్‌కుమార్ డబ్బు లేదని చెప్పినప్పటికి ప్రామిసరి నోట్ల పై సంతకాలు తీసుకుని ఫైనాన్సర్ల వద్ద నగదు తీసుకుందామని చెప్పి పూర్తిగా మోసం చేశారు. బాధితుడు దిక్కు తోచక జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పట్టాభిపురం ఎస్ఐ ఆంజనేయులు మోసం చేసిన శ్రీకాంత్ మహేష్, భువనం శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్వజ స్తంభం తొలగింపు



అధికారుల సమక్షంలో ధ్వజ స్తంభం తొలగిస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలోని ధ్వజ స్తంభం శిథిలావస్థకు చేరింది. చెదలు పట్టి పూర్తిగా పాడయి పోవడంతో గ్రామానికి చెందిన దాత డి.ప్రభాకరరావు నూతన ధ్వజ స్తంభం ఏర్పాటుకు ముందుకువచ్చారు. సోమవారం ధ్వజ స్తంభం వద్ద దాత ప్రత్యేక పూజలు చేసి. కొబ్బరికాయ కొట్టారు. రెవెన్యూ, పోలీసు, ఎండోమెంటు అధికారుల సమక్షంలో ప్రొక్లెయిన్‌తో చెక్క ధ్వజ స్తంభాన్ని తొలగించారు. నూతన ధ్వజ స్తంభం ఏర్పాటుకు ముహూర్తం నిర్ణయించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ డి.ప్రభాకరరావు, ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, ఈవో శ్రీనివాసరావు, వీఆర్వో బ్రహ్మయ్య, రైటర్ దాసు, సీటి సంఘాల అధ్యక్షుడు అంచుల శంకరరావు, కూనా ఏడుకొండలు, డి.సీతారామయ్య, సుబ్బారెడ్డి, ధర్మకర్త లక్ష్మారెడ్డి, డి.ప్రసన్నమూర్తి, డి.కృష్ణమూర్తి, కె.శేషు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి



డీవీఆర్‌ను సత్కరిస్తున్న అగస్టీయన్ తదితరులు

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన గుంటూరు జిల్లా దివ్యాంగుల విభాగ అధ్యక్షుడు బొక్క అగస్టీయన్ సోమవారం మంగళగిరి ఆత్మకూరు పరిధిలోని పార్టీ కార్యాలయంలో దొంతిరెడ్డి వేమారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డివిఆర్ మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుంటామన్నారు. దివ్యాంగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బద్దెల కిరణ్‌రాజు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, వేమూరి వందనం, ఈపూరి ఆదాం, కట్టిపోగు నాగభూషణం పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, యువకులు వేమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. డీవీఆర్‌ను కలసిన వారిలో నాయకులు బియ్యపు రత్నరాజు, పిల్లి సన్ని, ఊరగంటి డేవిడ్, సాయి, పిల్లి తండి ఉన్నారు.

నూతన మోటారు వాహనాల చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్‌యూ సీఎస్‌ఈ హానర్స్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు వడ్డేశ్వరం హైవేలోని సర్వీస్ రోడ్డులో వాహనదారులకు నూతన మోటారు వాహనాల చట్టంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనదారులకు విధించే జరిమానాలు మార్చి 1వ నుంచి పెరిగాయని తెలిపారు. హెల్మెట్ లేకపోతే రూ.1000, లైసెన్స్ లేకపోతే రూ.10 వేలు, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.2 వేలు జరిమానా విధిస్తారని వివరించారు. సీఎస్ఈ హానర్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకరరావు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లను యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా



పారిశుద్ధ్య కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్ : పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేసి నూరుశాతం స్వచ్ఛతను సాధించేలా కృషి చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెం గ్రామంలో సోమవారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో పనితీరును పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి, వారికి అప్పగించిన ప్రాంతాల్లో రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, తరచుగా చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమున్నత 'ఆశ్రయం' కావాలి

- ఆంధ్రా ప్యారిస్‌లో మానసిక రోగుల సంచారం
- వీరికి ఆశ్రయం కల్పించాల్సిన అవసరం ఉంది
- గతంలో అభాగ్యులకు సేవాలయంగా నిలిచిన 'ఆశ్రయ'
- పదేళ్లపాటు 200 మందికి పైగా అక్కున చేర్చుకున్న కేంద్రం
- 170 మందికి స్వస్థత
- అనివార్యకారణాలతో మూతపడిన వైనం



తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో నడిచిన ఆశ్రయ కేంద్రం

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో మానసిక రోగుల సంచారం కనిపిస్తోంది. శరీర సంస్కారం లేకుండా దొరికింది తింటూ రోడ్లే ఆవాసంగా గడుపుతున్నారు. మనస్థిమితం లేకుండా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించే అభాగ్యులను చూసి స్థానికులు పక్కకు తప్పుకుని వెళుతున్నారు. చిన్నపిల్లలు వారికేసి ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. రోజూ కనిపిస్తుండే వీరికో ఆశ్రయం కల్పించటం అవసరమన్న భావన వ్యక్తమవుతోంది. గతంలో పట్టణంలో పదేళ్లపాటు నడిచిన 'ఆశ్రయ'ను గుర్తుచేసుకుంటున్నారు. కట్టుబట్టలు లేకుండా పట్టణంలో కొత్తపేటలో రద్దీ రోడ్డు వెంట గడుపుతున్న మానసిక రోగి దీనావస్థపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించటం, అతడిని గోరంట్లలోని సేవాసదనానికి తరలించటం తెలిసిందే. తీరా చూస్తే అతడొక్కడే కాదు.. మరికొందరు మానసిక రోగులు పట్టణంలో సంచరిస్తున్నారు. గాంధీచౌక్‌లోని కెల్లీ బంకు ఎదుట పడిన చాక్లెట్ రేపరును ఆశగా తీసుకుని రుచిచూస్తున్న నడివయసు వ్యక్తి, బోసురోడ్డులో సీతాంబ హోటల్ సెంటర్లో దుమ్ముకొట్టుకుపోయిన దుస్తుల్లో నోట్లో సిగరెట్‌తో పోజులిస్తున్న మరో వ్యక్తి కనిపించాడు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ దొరికింది తింటూ రోడ్డుపక్కనే నిద్రిస్తూ కాలం గడుపుతున్నారీ మానసిక వ్యాధుల బాధితులు.

2008లో అప్పటి కలెక్టర్ వెంకటేశం చొరవతో..

గతంలో పట్టణంలోని 'ఆశ్రయ' కేంద్రం ఇలాంటి ఎందరికో ఆశ్రయమిచ్చింది. చక్కని భోజనం, వసతి, దుస్తులు ఇచ్చి పరిశుభ్రమైన జీవితాన్నిచ్చింది. ఇక్కడ గడిపిన కొందరు మానసిక రోగులకు స్వస్థత చేకూరి తమ ఇళ్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో గడిపినవారున్నారు. జిల్లా కలెక్టర్‌గా చేసిన బి.వెంకటేశం చొరవతో 2008లో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఆశ్రయ కేంద్రం ఏర్పాటైంది. రోడ్లవెంట పిచ్చిగా తిరిగే నిర్భాగ్యుల సమాచారం తెలిస్తే, వారిని ఇక్కడకు తీసుకొచ్చేవారు. ప్రత్యేక సిబ్బంది వీరి ఆలనా పాలనా చూస్తారు. గుంటూరునుండి మానసిక వైద్యుడు పదిరోజులకోసారి వచ్చేవారు. పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలతో డాక్టర్లు, నర్సులు అత్యవసర వైద్య సేవలు అందించారు. ఆశ్రయ కేంద్రం ఇన్‌చార్జిగా నండూరి జైరాజ్ వ్యవహరించారు. ఇద్దరు వాచ్‌మెన్లు, నర్సు, సహాయకుడు ఆశ్రయ కేంద్రంలోని వారి ఆలనా పాలన చూసేవారు. ఆహారాన్ని ప్రభుత్వ ఆసుపత్రి సమకూర్చేది. ఇతర ఖర్చులను జిల్లా కలెక్టర్‌గా చేసిన బి.వెంకటేశం ఏ ప్రాంతంలో ఉద్యోగవిధుల్లో ఉన్నప్పటికీ భరిస్తూ వచ్చారు. పదేళ్లపాటు నడిచిన ఆశ్రయ కేంద్రం దాదాపు 200 మందికిపైగా ఆశ్రయమిచ్చింది. వారి బాగోగులు చూస్తూ వైద్యసేవలనూ అందించింది. వీరిలో 170 మంది స్వస్థత పొందారు. కుటుంబమంటూ ఉంటే అక్కడకు చేర్చారు. లేనివారిని ఇక్కడే ఉంచారు. వీరిలో ఎక్కువమంది ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, నేపాల్‌కు చెందినవారుగా గుర్తించారు. పేదరికం, నిరాదరణ, కుటుంబ సమస్యల కారణంగానే వీరిలో పలువురు మానసిక రోగులుగా తయారయ్యారని వారి ద్వారానే తెలిసింది. పదేళ్లు నడిచిన ఆశ్రయ కేంద్రం తర్వాత మూతపడింది. ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన నండూరి జైరాజ్ మరణించటం ఇందుకో కారణం. తర్వాత జైరాజ్ కుమారుడు కొంతకాలం కొనసాగించినా, రకరకాల కారణాలతో ఆశ్రయ నడవలేదు. దీనితో ఆ విభాగాన్ని మూసేశారు. రోడ్లవెంట తిరిగే మానసిక రోగులకు ఆవాసం లేకుండాపోయింది. ఈ సందర్భంగా ఆశ్రయ ప్రారంభోత్సవ సభలో నాటి కలెక్టర్ బి.వెంకటేశం అన్న మాటల్ని గుర్తుచేసుకోవాలి. 'తెనాలి పెద్ద సాంస్కృతిక కేంద్రం అంటారని, కేవలం నాటకాలు, సినిమా షూటింగులు, థియేటర్లు ఉంటేనే గొప్ప కాదనీ, తోటి మనిషిని సమానస్థితిలో చూడటమే సంస్కృతి. ఉన్నవాడు కవిత్వం రాస్తూ, లేనివాడు ఆకలితో ఏడ్వడమే మిటి? తోటిమనిషిని గురించి ఆలోచించనపుడు మనం పూర్తిగా నాగరికులం కాదని అనిపిస్తోంది' అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అదే భావనతో ఉన్నపుడు మరోసారి ఆశ్రయ కేంద్రం ఆవిర్భావం పెద్ద సమస్య కాబోదని స్థానికుల అభిప్రాయం.



ఆశ్రయ కేంద్రంలోని మానసిక రోగులు

గంజాయి విక్రేత అరెస్ట్

నగరంపాలెం: గంజాయి విక్రయించే యువకుడ్ని కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నరసరావుపేట పట్టణం బీసీ కాలనీకి చెందిన బి.హేమలయ్య అలియాస్ హేమంత్, తక్కెళ్లపాడుకి చెందిన ఆదాంషఫీ రెండు కిలోల గంజాయితో గుంటూరు నగరానికి వచ్చారు. బస్ ఎక్కే క్రమంలో మణిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఇద్దరు వేచి ఉన్నారు. ముందస్తు సమాచారంతో కొత్తపేట పీఎస్ ఎస్ఐ హనుమంతరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆదాంషఫీ అక్కడి నుంచి వెళ్లిపోగా, అనుమానాస్పదంగా ఉన్న హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సోదాలు నిర్వర్తించగా రెండు కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో అతడిని అరెస్ట్ చేసి గంజాయి సీజ్ చేశారు. హేమంత్, ఆదాంషఫీ స్నేహితులని, ఇద్దరు కలిసి నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చారని విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



కుర్రగంటి రఘు

తాడికొండ: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటన తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొండపాడు గ్రామానికి చెందిన 14 సంవత్సరాల యువకుడు కొర్రగంటి రఘు కొలకలూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఉంటూ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శివరాత్రి సందర్భంగా స్వగ్రామం దొండపాడుకు వచ్చిన యువకుడు గత ఆదివారం 3గంటల సమయంలో హాస్టల్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అయితే హాస్టల్‌కు విద్యార్థి చేరుకోకపోవడంతో పరిసర ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో సోమవారం తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి తండ్రి బుజ్జి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు ఎస్సై కలగయ్య చెప్పారు.